# <u>పత్రికా ప్రకటన</u>

**తేది.08.08.2017.**

## <u>ఆటో డ్రైవర్‌ల ముసుగులో దొంగతనాలకు పాల్పడిన రెండు ముఠాలు అరెస్ట్</u>

### *సుమారు మొత్తం రూ.1.50 లక్షల విలువైన నగదు, బంగారం స్వాధీనం*

ఈ మధ్య కాలంలో నగరంలో జరుగుతున్న దొంగతనాలపై ప్రత్యేక దృష్టిసారించిన నగర పోలీస్ కమీషనర్ శ్రీ డి.గౌతం సవాంగ్ ఐపిఎస్ గారి ఆదేశాల మేరకు సిసిఎస్ పోలీసులు అనుమానిత వ్యక్తులపై గట్టి నిఘాను ఏర్పాటు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో ది.08.08.2017న సి.సి.యస్. పోలీసులకు అందిన సమాచారం ప్రకారం కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో పండిట్‌నెహ్రూ బస్‌స్టాండ్ వద్ద ఆటో పెట్టుకుని అనుమానాస్పదంగా ఉన్న నలుగురు వ్యక్తులను మరియు భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలో లారీస్టాండ్ వద్ద ఆటోపెట్టుకుని ప్రయాణీకులను ఎక్కించుకునేందుకు సిద్దంగా ఉన్న మరో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించడం జరిగింది.

పట్టుబడిన రెండు ముఠాల్లోని 8 మంది వ్యక్తులు ఆటోడ్రైవర్ మరియు సాధారణ ప్రయాణీకులుగా వ్యవహరిస్తూ ఆటోలో ఎక్కిన ప్రయాణీకుల దృష్టి మరల్చడం ద్వారా వారి జేబుల్లో లేదా వెంటతెచ్చుకున్న బ్యాగుల్లో నుండి నగదు, బంగారం మరియు సెల్‌ఫోన్‌లు దొంగిలించనట్లు వెల్లడి కావడంతో 8 మంది నిందితులను అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి సుమారు రూ.1.50 లక్షల విలువైన నగదు మరియు 16 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగింది.

ఈ రెండు ముఠా సభ్యులు వేరు వేరుగా పండిట్ నెహ్రూ బస్‌స్టాండ్ నుండి ఏలూరు రోడ్డు మరియు బందర్‌రోడ్డులో ప్రయాణీకులను తమ ఆటోలో ఎక్కించుకుంటారు. కొంత దూరం ప్రయాణించిన తరువాత పోలీసులు కేసులు రాస్తున్నారంటూ ప్రయాణీకుడిని నమ్మిస్తారు. ఈ లోగా డ్రైవర్ సీటు ప్రక్కన కూర్చున్న మరో నిందితుడు వెనుకసీట్లోకి వస్తాడు. అప్పటికే ప్రయాణీకులతో పాటు కూర్చున్న మరో నిందితుడి సహాయంతో చాకచక్యంగా వ్యవహిరించి వారి జేబుల్లో ఉన్న నగదు లేదా ప్రయాణీకుల బ్యాగుల్లో ఉన్న నగదు, నగలు మరియు సెల్‌ఫోన్‌లను అనుమానం రాకుండా దొంగిలిస్తారు. అనంతరం ప్రయాణీకులకు సాకులు చెప్పి గమ్యం స్థానం చేర్చకుండానే వారిని ఆటోలో నుండి బలవంతంగా దించేస్తారు.

### <u>నలుగురు సభ్యులున్న పాత నేరస్థుడు తోకల నాగరాజు ముఠా అరెస్ట్ :</u>

విజయవాడ ఇబ్రహీంపట్నం మండలం జూపూడికి చెందిన పాత నేరస్థుడు తోకల నాగరాజు (35), గుంటూరు నల్లపాడుకు చెందిన శిమ్మిశెట్టి నాగరాజు (22), గుంటూరు జిల్లా ఖాజా గ్రామానికి చెందిన మేడా నరసింహారావు (32) మరియు విజయవాడ భీమనవారిపేటకు చెందిన మేడా కోటేశ్వరరావులు సమీప బంధువులు మరియు స్నేహితులు.

*(మిగతా 2వ పేజీలో ...)*

చిన్న వయసు నుండి చెడు వ్యసనాలకు అలవాటుపడిన నలుగురు నిందితులు కలసి ఒక ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నారు. ఆటోను అద్దెకు తీసుకుని పాత బస్‌స్టాండ్, ఏలూరురోడ్డు మరియు బందర్‌రోడ్డులో ప్రయాణీకులను ఎక్కించుకుంటారు. నిందితుల్లో ఒక వ్యక్తి ఆటో నడుపుతుండగా మిగతా వారు ఏమీతెలియనట్లు సాధారణ ప్రయాణీకుల్లా కూర్చుని, తోటి ప్రయాణీకులు ఏమరుపాటుగా ఉన్న సమయంలో లేదా వారిని మాటల్లోకి దించడం ద్వారా వారి జేబుల్లో నుండి నగదు మరియు సెల్‌ఫోన్‌లు దొంగిలిస్తారు. దొంగతనం అనంతరం ప్రయాణీకులకు అనుమానం రాకుండా మార్గ మధ్యలోనే ఇతర సాకులు చెప్పి వారిని ఆటోలో నుండి బలవంతంగా దించేస్తారు.

ఈ తరహా నేరాలు కృష్ణలంక పోలీస్‌స్టేషన్ పరిధిలో 2, గవర్నరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 3, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 మొత్తం 6 నేరాలకు పాల్పడటం జరిగింది. నలుగురు నిందితుల గురించి పక్కా సమాచారం అందుకున్న సిసియస్ పోలీసులు వీరిని అరెస్ట్ చేసి, వీరి వద్ద నుండి రూ.69500/-ల నగదు మరియు నేరానికి ఉపయోగించిన ఆటో స్వాధీనం చేసుకోవడం జరిగింది.

## నలుగురు సభ్యులున్న పాత నేరస్థుడు చల్లా నాంచారయ్య ముఠా అరెస్ట్ :

జక్కంపూడికి చెందిన చెల్లా నాంచారయ్య (28), వాంభేకాలనీకి చెందిన నబ్బా సింహాచలం (22), అదే ప్రాంతానికి చెందిన తమ్మిశెట్టి తిరుపతిరావు (22) మరియు గుంటూరుకు చెందిన పానుగంటి వెంకటేశ్వరరావు (27)లు వివిధ దొంగతనం కేసుల్లో పాత నేరస్థులు. జులాయిగా తిరుగుతూ చెడు వ్యసనాలకు అలవాటుపడిన నలుగురు నిందితులు కలసి ఒక ముఠాగా ఏర్పడి సులభంగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలను మార్గంగా ఎంచుకున్నారు. ఆటోను అద్దెకు తీసుకుని గవర్నరుపేట, సూర్యారావుపేట మరియు మాచవరం పోలీస్‌స్టేషన్ల పరిధిల్లో ప్రయాణీకులను ఎక్కించుకుంటారు. నిందితుల్లో ఒక వ్యక్తి ఆటో నడుపుతుండగా మిగతా వారు ఏమీ తెలియనట్లు సాధారణ ప్రయాణీకుల్లా కూర్చుని, తోటి ప్రయాణీకులు ఏమరుపాటుగా ఉన్న సమయంలో లేదా వారిని మాటల్లోకి దించడం ద్వారా వారి జేబుల్లో నుండి నగదు మరియు ప్రయాణీకులు వెంటతెచ్చుకున్న బ్యాగుల్లో నుండి బంగారం దొంగిలించడం జరిగింది. దొంగతనం అనంతరం ప్రయాణీకులకు అనుమానం రాకుండా కంగారుపెట్టి మార్గ మధ్యలోనే ఇతర సాకులు చెప్పి ఆటోలో నుండి బలవంతంగా దించేస్తారు.

ఈ తరహా నేరాలు గవర్నరుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 4, సూర్యారావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 2 మరియు మాచవరం పోలీస్‌స్టేషన్ పరిధిలో 1 మొత్తం 7 నేరాలకు పాల్పడ్డారు. నలుగురు నిందితుల గురించి పక్కా సమాచారం అందుకున్న సిసియస్ పోలీసులు వీరిని అరెస్ట్ చేసి, వీరి వద్ద నుండి రూ. 80 వేల నగదు మరియు 16 గ్రాముల బంగారం స్వాధీనం చేసుకోవడం జరిగింది.

– xx ––